క్లుప్తంగా

రైతు ఉత్పత్తి సంఘంలో సభ్యులుగా చేరాలి

మరికల్: కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన రైతు ఉత్పత్తి సంఘంలో సభ్యులుగా చేరేందుకు రైతులు ముందుకు రావాలని తీలేర్ సహకార సంఘం అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండలంలోని రాకొండ గ్రామంలో సోమవారం ఉత్పత్తి సంఘాల సభ్యత్వ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న రైతు రూ.2 వేలు చెల్లించి సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఈఓ కృష్ణ, డైరెక్టర్లు జయసింహారెడ్డి, కృష్ణయ్య, హరీశ్, లక్ష్మణ్, నర్సిములు పాల్గొన్నారు.

కుర్వల అభ్యున్నతికి కృషి



మక్తల్: నియోజకవర్గ స్థాయి మదాసి, మాదరి కుర్వ సంఘం కమిటీని సోమవారం పట్టణంలో బీరప్ప ఆలయం మైదానంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా ఓబులాపూర్ గ్రామానికి చెందిన అంజప్ప, ఉపాధ్యక్షుడిగా మక్తల్‌కు చెందిన నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా వీరేష్‌ను నియమించారు. ఈ సందర్భంగా అంజప్ప మాట్లాడుతూ కుర్వల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ ట్రేడ్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, మాజీ అధ్యక్షుడు వెంకటయ్య, శ్రీనివాస్, రాజు, ఎల్లలింగ, ఆశప్ప, బీరప్ప, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ



దామరగిద్ద: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మంజూరు చేసిన ఇంటి నిర్మాణానికి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, విండో అధ్యక్షుడు ఈదప్ప సమక్షంలో మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సహకారంతో ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరుతుందన్నారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటే బిల్లులు సకాలంలో అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కన్నిరెడ్డి, ఖాజామియా, ఆనంద్, వెంకట్రామరెడ్డి, నర్సింహ, వెంకట్రాములు, తంబలి రఘు తదితరులు పాల్గొన్నారు

రైతుల వినూత్న నిరసన



ఊట్కూరు: మక్తల్, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న దంతన్‌పల్లికి చెందిన 40 మంది రైతులు సోమవారం తమ కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇళ్ల వద్ద వినూత్న నిరసన చేపట్టారు. తమ భూములకు నష్టపరిహారం ఎకరాకు రూ.30 లక్షలు ఇవ్వాలని, ఎమ్మెల్యే తమకు న్యాయం చేయాలని కోరుతూ ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో రైతులు గోపాల్‌రెడ్డి, ధర్మరాజు, సురేందర్‌రెడ్డి, తరుస్ తదితరులు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మెరుగైన వైద్యం

నర్వ: పేదలు అనారోగ్యం బారిన పడితే వారు మెరుగైన వైద్యం చేయించుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ అన్నారు. సోమవారం సీపూర్ గ్రామానికి చెందిన కోటిరెడ్డికి రూ.4 లక్షల విలువల గల ఎల్ఓసీని సందర్భంగా అందజేశారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

నారాయణపేట: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కలెక్టరేట్ ఎదుట మంగళవారం నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. 9 నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు, కోడిగుడ్డు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు 18 నెలలు ఇవ్వాల్సి ఉందన్నారు. మధ్యాహ్నం భోజనంలో నాణ్యత లేదని, మెనూ పాటించడం లేదంటూ అక్రమ తొలగింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. అక్రమ తొలగింపులు ఆపడంతో పాటు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ జరిగే ధర్నాకు మధ్యాహ్న భోజన కార్మికులు వంటలు బంద్ చేసి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

వృథాగా ‘ఉపాధి’ భవనం

- దుర్గంధం వెదజల్లుతున్న గదులు
- చిన్న గదుల్లో కొనసాగుతున్న కార్యాలయం
- పట్టించుకోని అధికారులు



ఊట్కూర్‌లో మహిళా సమాఖ్య, ఉపాధిహామీ భవనం

ఊట్కూర్: ప్రభుత్వం రూ.లక్షల వ్యయంతో వివిధ శాఖల కార్యకలాపాలను నిర్వహించేందుకు ప్రజల సౌకర్యార్థం మౌలిక వసతులతో కూడిన పక్కా భవనాలను నిర్మిస్తున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల నిరుపయోగంగా మారుతున్నాయి. పదేళ్ల క్రితం మండల కేంద్రంలోని కోట వీధి ప్రాంతంలో ఐకేపీ, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.32 లక్షలతో రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. కింది అంతస్తులో సమావేశాల నిర్వహించేందుకు విశాలమైన హాల్‌తో పాటు 3 గదులు, పై అంతస్తులో 4 గదులతో పాటు మరుగుదొడ్లు నిర్మించారు. భవనంలో కింది అంతస్తును మహిళా సమాఖ్య కార్యాలయం, పై అంతస్తును ఉపాధిహామీ కార్యాలయాలకు కేటాయించారు. కానీ భవనంలో మహిళా సమాఖ్య కార్యాలయం మాత్రమే కొనసాగుతుంది. ఉపాధి హామీ కార్యాలయం ఎంపీడీఓ కార్యాలయంలో కొనసాగుతుండడంతో వీరికి కేటాయించిన భవనం గదులు నిరుపయోగంగా మారడంతో నిర్వహణ లేక దర్గంధం వెదజల్లుతున్నాయి. గదుల్లో ఉపాధి హామీ పథకానికి సంబంధించిన రికార్డుల మూటలు, మానసిక దివ్యాంగుల పాఠశాలకు సంబంధించిన వస్తువులు ఉంచారు. నెలలు గడిచినా గదులను తెరువకపోవడంతో బూజు పట్టి దర్శన మిస్తున్నాయి. మరుగుదొడ్లు వృథాగా ఉంటున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి హామీ భవనాన్ని వాడుకలోకి తీసుకరావాలని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఉపాధి హామీ భవనం గదుల్లో నిల్వ చేసిన రికార్డులు

ఉపాధి హామీ కార్యాలయం ఇలా...

మండల పరిషత్ కార్యాలయం భవనంలోని రెండు అదనపు గదుల్లో ఉపాధి హామీ కార్యాలయం కొనసాగుతుంది. ఒక గదిలో కంప్యూటర్లు ఏర్పాటు చేయగా.. మరో గదిని సిబ్బందికి కేటాయించారు. వివిధ పనులపై వచ్చిన రైతులు, కూలీలు కార్యాలయంలో కూర్చోడానికి స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు లేని సమయంలో బయట వరండాలో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు, కూలీలు వాపోతున్నారు.

> **ఉన్నతాధికారులకు నివేదిస్తాం**
>
> భవనాన్ని పరిశీలించి, గదులను శుభ్రపరుస్తాం. ఉపాధి హామీ భవనం నిరుపయోగంగా ఉండడాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. భవనాన్ని వినియోగంలోకి తెచ్చి ప్రజల ఇబ్బందులు తొలగిస్తాం.
>
> – ధనుంజయగౌడ్, ఎంపీడీఓ

‘కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు’



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఊట్కూరు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడంతో పాటు బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటుదామని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం సింగారం చౌరస్తాలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఊట్కూరు మండల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా కార్యకర్తల మనోభావాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. కల్యాణలక్ష్మిలో భాగంగా లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని ఇవ్వలేదని, మహిళలకు ప్రతి నెలా రూ.2,500 ఇస్తామని చెప్పి మాట తప్పారని మండిపడ్డారు. మక్తల్, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.14 లక్షల నష్టపరిహారం ఇవ్వడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని, వారికి మార్కెట్ విలువను బట్టి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలు ప్రణాళికాబద్ధంగా పనిచేసి వచ్చే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చిట్టెం సుచరిత, రాజుల ఆసిరెడ్డి, అరవింద్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎల్లగౌడ్, రాంరెడ్డి, ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా సత్యాంజనేయులు



నూతన కార్యవర్గం సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

మక్తల్: పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో స్థానిక లయన్స్ క్లబ్ బీమా 2025–26 సంవత్సరానికి గాను నూతన అధ్యక్షుడిగా సత్యాంజనేయులు, కార్యదర్శిగా అంజన్‌ప్రసాద్, కోశాధికారిగా ఆడెం సత్యనారాయణను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులుగా మణికంఠగౌడ్, వాకిటి రమేష్, డాక్టర్ రాజేష్‌గౌడ్, జాయింట్ కార్యదర్శి పృథ్వీరాజు, ఉపాధ్యక్షుడు నాగరాజు, కావలి తాయప్ప, జయశ్రీ, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్‌గా కోళ్ల వెంకటేష్, మెస్ చైర్మన్‌గా అరుణ, క్లబ్ మార్కెటింగ్ చైర్మన్ రవికుమార్‌గౌడ్, వాదిరాజ్, అరవింద్, వెంకటయ్య తదితరులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు 600 నోటు బుక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎక్సలెన్స్ ఈవెంట్ చైర్మన్ నాగరాజు, జోన్ చైర్మన్ సూగూరు జైపాల్‌రెడ్డి, ప్రోగ్రాం చైర్మన్ గవినోళ్ల గోపాల్‌రెడ్డి, కోచర్ కాకులారం అశోక్ , జిల్లా కోఆర్డినేటర్ ఆత్మారావు, జడ్జీలు కొండయ్య, రాజుల ఆశిరెడ్డి, డాక్టర్ శ్రీరామ్, శ్రీనివాస్, రవికుమార్ పాల్గొన్నారు.

ఆలయ వసతి గృహాల ప్రారంభోత్సవం



వసతి గృహాలను ప్రారంభిస్తున్న రాజ్‌కుమార్‌రెడ్డి

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి గ్రామంలో వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన వసతి గృహాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. అంతకముందు ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వసతి గృహాలు నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నారాయణ, శరణప్ప, బసిరెడ్డి, బసంత్‌రాజ్, మోహన్‌రెడ్డి, గంగాధర్, గణేష్, చెన్ను, ఫౌండేషన్ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, హన్మంతు, వెంకటేష్, నర్సింహనాయుడు, సంతోష్, నందుకుమార్, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

ఆయుర్వేదం దైన్యం

- నిరుపయోగంగా ఆస్పత్రి
- ప్రజలకు అందని వైద్యసేవలు
- శిథిలావస్థకు చేరిన భవనం, చుట్టూ ముళ్లపొదలు



చిన్నచింతకుంటలో నిరుపయోగంగా ఆయుర్వేదిక ఆస్పత్రి

చిన్నచింతకుంట: దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేదం ఎంతో ఉపయోగకరమని ప్రజల నమ్మకం. అలాంటి ఆయుర్వేద వైద్యం ప్రజలకు అందుబాటులో లేకుండాపోయింది. గత ప్రభుత్వంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాత భవనంలో ఆయుర్వేద ఆస్పత్రిని కొనసాగించారు. అయితే మండల ప్రజలు ఆయుర్వేద వైద్యసేవలు వినియోగించుకొని ఎంతోమంది దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసుకున్నారు. ప్రస్తుతం ఆస్పత్రి మూతపడడంతో మండల ప్రజలు వైద్యానికి నోచుకోలేకపోతున్నారు. దీంతో కొందరు సమీప ప్రాంతాల్లో నాటువైద్యం చేయించుకుంటున్నారు. మరికొందరు దూరప్రాంతాలకు వెళ్లి ఆయుర్వేద ఆస్పత్రిలో చికిత్సను పొందుతున్నారు.

అందుబాటులోలేని వైద్యం

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో వైద్యసేవలు నిలిచిపోవడంతో అధికారులు మందులు, సామగ్రిని అధికారులు తీసేశారు. దీంతో ఆస్పత్రి నిరుపయోగంగా మారింది. ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకుంది. చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు అములుకున్నాయి. ఆస్పత్రి ఆవరణలో విష సర్పాలు సంచరిస్తున్నాయి. గ్రామస్తులు, పీహెచ్‌సీకి వచ్చే రోగులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మండల కేంద్రంలో ఆయుర్వేద ఆస్పత్రిని కొనసాగించాలని, శిథిలావస్థ భవనాన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

> **ఆయుర్వేద సేవలు కొనసాగించాలి**
>
> 
>
> ఆయుర్వేద ఆస్పత్రిని కొనసాగించాలి. ఎన్నో దీర్ఘకాలిక వ్యాధులు నయం అవుతాయి. గతంలో ఆస్పత్రి కొనసాగినప్పుడు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఎంతోమంది వచ్చి వైద్యసేవలు పొందారు. నేను కూడా గ్యాస్ట్రబుల్‌కు మందులు వాడగా పూర్తిగా నయమైంది.
>
> – మధు, చిన్నచింతకుంట

స్థానిక ఎన్నికల్లో యువతకు అవకాశం కల్పించాలి



కోస్గి రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు అవకాశం కల్పించాలని గుండుమాల్ మండలంలోని కొమ్మూర్ గ్రామానికి చెందిన యువకులు సోమవారం ముఖ్యమంత్రిని హైదరాబాద్‌లో కలిశారు. కొమ్మూర్ గ్రామంలో అండర్ డ్రెయినేజీ, మండల కేంద్రం నుంచి మల్లాపురం వరకు బీటీ రోడ్డు, హైస్కూల్ భవనం, ఎల్లమ్మ, పోచమ్మ గుడికి సీసీ రోడ్లు, నూతన పోస్టాఫీస్ మంజూరు చేయాలని కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి క్షేత్ర స్థాయిలో పరిశీలించి, త్వరగా పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఖాదర్‌పాషా, బాలరాజు, రమేష్ గౌడ్, రాజుగౌడ్, వెంకట్రాములు ఉన్నారు.

ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కోస్గి రూరల్: పీఎంశ్రీ ఆదర్శ పాఠశాలలో ఖాళీ గా ఉన్న తెలుగు ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నీలిమవరిని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అవర్‌లీ బుస్డ్ టీచర్ పీజీటీ తెలుగు పోస్టుకు పోస్టు గ్రాడ్యుయేట్‌తో పాటు బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 22 వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 24న ఇంటర్వ్యూ ఉంటుందని, ఆసక్తి గలవారు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని కోరారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు




ధన్వాడ: మండల కేంద్రంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ధన్వాడ నుంచి పాతపల్లికి వెళ్లేదారిలో గాంధీనగర్, ఎన్‌టీఆర్ కాలనీ, కుర్వ గేరిలో గుంతలు పడి వర్షపు నిరు నిలిచి బురదమయంగా మారడంతో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కిందపడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ ఇళ్లకు వెళ్లే దారే ఇలా ఉంటే గ్రామం మొత్తం పరిస్థితి ఎంత ఘోరంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని కార్మిక సంఘం జిల్లా నాయకుడు రాజు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి కనీసం గుంతలనైన పూడ్చి మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

హన్వాడ: అధిష్టానం సూచించిన అభ్యర్థి గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మారేపల్లి సురేందర్‌రెడ్డి, ఎస్పీ వెంకటేశ్ సూచించారు. సోమవారం మండలంలోని టంకరలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. త్వరలో జరగబోయే ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ సూచించిన అభ్యర్థుల గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుని భవిష్యత్‌లో పార్టీ పూర్వవైభవానికి నాంది పలకాలని కోరారు. ఎంపీటీసీ సెగ్మెంట్ వారీగా నిర్వహిస్తున్న ఈ సమావేశాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపులో ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు యువకులు సురేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ కృష్ణయ్యయాదవ్, మండల అధ్యక్షుడు మహేందర్, మాజీ సర్పంచ్ అచ్చన్న, నాయకులు బాలయ్య, జాంగీర్, తిరుపతయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నాసిరకంగా చెక్‌డ్యాం నిర్మాణం



చెక్‌డ్యాంకు సిమెంట్ పూత వేస్తున్న కార్మికులు

కొత్తపల్లి: మండలంలోని నిడ్జింత గ్రామ సమీపంలోని వాగుపై రూ.3.7కోట్లతో చేపట్టిన చెక్‌డ్యాం నిర్మాణ పనులు నాసిరకంగా కొనసాగుతున్నాయి. వాగు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం వాగులపై చెక్‌డ్యాంలు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్, అధికారులతో చేతులు కలిపి నాసిరకం పనులు చేసి చేతులు దులుపుకుంటున్నాడు. చెక్‌డ్యాంకు నిర్మాణం చేసిన కాంక్రీట్ వాల్‌లో సిమెంట్ తక్కువగా కలపడంతో తెల్లగా కనిపిస్తుందన్నారు. రైతుల పొలాల్లో నీరు నిలిచి కోతకు గురి కాకుండా ఎర్రమట్టి లేదా మొరం వేయాల్సి ఉండగా.. వాగులోని ఇసుకతో కూడిన లూజు మట్టిని వేసి తూతూమంత్రంగా పనులు కానిచ్చారు. చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టిన నాటి నుంచి కాంట్రాక్టర్ పని జరిగే ప్రదేశాన్ని ఏ ఒక్క రోజు కూడా పర్యవేక్షించలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత ఇరిగేషన్ ఏఈ కిశోర్ వివరణ కోరగా.. చేయాల్సిన పనులు ఇంకా చాలా ఉన్నాయి. చేసిన పనుల్లో నాణ్యత లేకుంటే ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రేపు విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న అజయ్

ఊట్కూరు: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23న నిర్వహించ తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేద్దామని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ కోరారు. సోమవారం ఊట్కూరులో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజురియింబర్స్‌మెంట్ మంజూరు చేయలేదని ఆరోపించారు. గ్రామాల్లో అమ్మ ఆదర్శ కమిటీలు వేసినా కనీసం పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయడంలో విఫలం అయ్యారన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. సమావేశంలో చంద్రశేఖర్, మహేష్, పరశురామ్, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ప్రతిభ చూపిన క్రీడాకారులు

మక్తల్: హైదరాబాద్‌లోని బండ్లగూడ, నాగోల్ వాటర్ గ్రౌండ్‌లో ఈ నెల 20న జరిగిన అస్మిత ఖేల్ ఇండియా ఉమెన్స్ రోడ్ స్పీడ్ సైక్లింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో నారాయణపేట జిల్లాకు చెందిన 150 మంది పాల్గొనగా 79 మంది జాతీయ స్థాయికి ఎంపికయ్యారని జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం తెలిపారు. ఆగస్టు చివరి వారంలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పీఈటీలు పుష్ప, శిల్ప, లావణ్య, మంజుల, త్రివేణి, పవిత్ర, దివ్య, అనూష, గిరిజ, మల్లేశ్వరి, అంకిత, రేణుక తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిడ్డ మంత్రి అయితే ఇంత అక్కసా..



మాట్లాడుతున్న చెన్నయ్యసాగర్

నర్వ: ప్రజాప్రభుత్వంలో ఓ బీసీ బిడ్డ మంత్రి అయితే ఇంత అక్కసు వెళ్లగక్కుతారా అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చెన్నయ్యసాగర్ అన్నారు. సోమవారం సీనియర్ నాయకుడు జలంధర్‌రెడ్డి ఇంటి వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివారం రాయికోడ్‌లోని ఓ నాయకుడి పొలంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి సుచరిత మంత్రి వాకిటి శ్రీహరిపై అనవసర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వారు తమ అక్కసును వెళ్లగక్కి బీసీ బిడ్డలపై తమ ప్రేమ ఉందో నిరూపించుకున్నారని దుయ్యబట్టారు. దివంగత ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి మరణించిన తర్వాత ఆయన స్థానంలో ఎమ్మెల్యేగా గెలిచిన రామ్మోహన్‌రెడ్డి.. కింది స్థాయి నుంచి ప్రజల మద్దతుతో ఎదిగిన మంత్రిని మేము గెలిపించామనడం హాస్యాస్పదమన్నారు. పదేళ్లలో మీరు చేసిన అభివృద్ధి.. 18 నెలల్లో మంత్రి వాకిటి శ్రీహరి చేసిన అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధమా అని అన్నారు. 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించి గతంలో ఎవరూ చేయని సాహసం సీఎం రేవంత్‌రెడ్డి చేశాడని కొనియాడారు. త్వరలో మండలంలో రూ.12 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు. సమావేశంలో వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, కృష్ణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శరణప్ప, సుధాకర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కుర్వ మహేష్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలు



మక్తల్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

మక్తల్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం పట్టణంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్‌కుమార్, కోళ్ల వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు రవికుమార్, కట్ట సురేష్, రాజప్పగౌడ్, నాగేష్, గోవర్ధన్, సూర్యకుమార్, అంజి, రాజేందర్, నర్సింహ, ఫయాజ్, వెంకట్‌రాములు, పాష, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండల కేంద్రంలో సోమవారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కార్యకర్తలకు స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్ఫరాజ్‌ఖాన్, నాగప్ప, సంతోష్‌పాటిల్, సురేష్, అంబ్రేష్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

నర్వ: మల్లికార్జున ఖర్గే పుట్టిన రోజును పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులు కేక్‌ను కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెన్నయ్యసాగర్, జగన్‌మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శరణప్ప, వెంకట్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జబ్బార్, నరేష్, సంజీవరెడ్డి, అయ్యపురెడ్డి, ఆంజనేయరెడ్డి, గడ్డం నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

పందుల చోరీ: కేసు నమోదు

ఆత్మకూర్: పందులను అపహరించిన సంఘటనలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ తెలిపారు. ఆదివారం అర్ధరాత్రి బొలెరో వాహనంలో వచ్చిన దొంగలు పట్టణ శివారులోని బ్రిడ్జి కింద పెంచుతున్న పందులను ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. సోమవారం పందుల యజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వారు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సప్తాహ భజనలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తాహ భజనలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం మండలంలోని బిజ్వారం, ఈదులపల్లి, చర్లగార్లపాడు, ఆరగిద్ద గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు సప్తాహ భజనల్లో పాల్గొన్నారు. వారం రోజుల పాటు కొనసాగనున్న భజనల్లో మండలి సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆయల అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో ఎరువులు అందించాలి

హన్వాడ: మండలంలోని అంబటోనిపల్లిలో హన్వాడ-వేపూర్ ప్రధాన రహదారిపై రైతు సంఘం నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. రైతులకు ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా మండలంలో 13వేల ఎకరాల్లో పంటలు సాగుచేస్తారని.. ఇందుకు సరిపడేంత యూరియా, డీఏపీలు అందించాల్సిన ప్రభుత్వం కేవలం 100టన్నుల యూరియా, 40టన్నుల డీఏపీ సరఫరా చేసిందన్నారు. నిజానికి మండలంలో 16.80 టన్నుల యూరియా, 610టన్నుల డీఏపీ అవసరమన్నారు. ప్రభుత్వం రైతులకు సరిపడా ఎరువులను వెంటనే సరఫరా చేయనిపక్షంలో రైతుల పక్షాన నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతుసంఘం మండలాధ్యక్షుడు లక్ష్మయ్య, నాయకులు కుర్మయ్య, రాములు, వెంకటమ్మ, రమణయ్య, రేఖమయ్య, తిరుమల్‌రెడ్డి, శేఖర్, బాలయ్య పాల్గొన్నారు.

